# డైరెక్షన్

● మహర్షి ●

**"నిన్ను నీ పర్సనాలిటి, నీ మాటలు చూసి చాలా చురుకైన వాడివని నమ్మి యాభై లక్షలు నీ చేతిలో పోసి కథ చెప్పమంటే సస్పెన్స్ అంటావు.**

యాక్టర్లను చెప్పమంటే సస్పెన్స్ అంటావు. పోనీ ఎంతకాలంలో సినిమా పూర్తవుతుందంటే సస్పెన్స్ అంటావు. నీ వాలకం చూస్తుంటే నన్ను నట్టేట ముంచేలా వున్నావు" నెత్తి మీద పంచె కప్పుకుని బావురు బావురుమని ఏడ్చాడు నిర్మాత.

"మీ సినిమా సంగతి ఏమో కానీ నేను మాత్రం దెబ్బతో డైరెక్టర్ని కావడం ఖాయం. అయినా మీకొచ్చిన కష్టం, నష్టం నాకెందుకు చెప్పండి" బానలాంటి కడుపు ఊపుకుంటూ నవ్వాడు డైరెక్టర్.

"అవున్లే. నాకొచ్చిన నష్టం నీకెందుకుంటుంది. ఇరవై ఎకరాల కొబ్బరి తోట తెగనమ్మి మరీ తెచ్చానా డబ్బు. బాబ్బాబు నాకు నిద్ర పట్టడం లేదు. సినిమా ఎంతవరకు అయిందో కాస్త చెప్పు నాయనా..." గడ్డం పట్టుకుని బ్రతిమాలాడు నిర్మాత.

"అబ్బ. మీకన్నీ తొందరే. మరో గంటలో ఎడిటింగ్ పూర్తి చేసుకుని వస్తున్నది. మనం వెంటనే ప్రివ్యూ వేసుకుందాం" అన్నాడు డైరెక్టర్.

★★★★

"సినిమా పేరు మరీ అనవ్యాంగా వున్నట్టున్నది డైరెక్టరు. 'చేతికి బట్ట చెవిలో చుట్ట' అదేం పేరు నాయనా!" నిర్మాత లబోదిబో మన్నాడు.

"కంగారు పడకంటి. అది సినిమా కథకు దగ్గ టైటిల్. సినిమా చూడండి. తరువాత మీకే నచ్చుతుంది" అన్నాడు డైరెక్టరు.

రీలు మెల్లగా నడుస్తున్నది.

"అదేంటయ్యా పేర్లు అవగానే పాట పెట్టావు. అయినా హీరోయిన్ ఎవరో అసలు తెలియడం లేదు. ఎంతసేపు ఆమె తొడలు ఆపె కనబడుతున్నాయి తప్ప మొహం కనిపించడం లేదు. ఒక్కసారంటే ఒక్కసారి మొహం చూపిస్తే బాగుండేదేమో... మరి హీరో మొహం తప్ప మరేం చూపించలేదు. ఇదే విడ్డూరం బాబూ డైరెక్టర్" చిరాగ్గా అడిగాడు నిర్మాత.

"ఓస్ అదా మీ అనుమానం. హీరోయిన్ మొహం చూపిస్తే జనం వాంతులు చేసుకుంటారు. హీరో శరీరం చూపిస్తే రాళ్ళేసి కొడతారు. అందుకే ట్రిక్ ప్లే చేసి అలా తీశానన్న మాట. నాదంతా స్పెషల్ సస్పెన్స్ డైరెక్షన్. మన సినిమాకి అవార్డు ఖాయం" అన్నాడు డైరెక్టర్.

"దేశంలో యాక్టర్లు కరువైనట్లు అలాంటి దిక్కు మాలిన ఫేసులతో నిన్ను సినిమా ఎవడు తీయమన్నాడు?"

"అదే నా స్పెషల్. అలాంటి వాళ్ళను పెట్టి సినిమా తీసి హిట్ చేస్తే ముందు ముందు నాకు మంచి మంచి ఆఫర్లు వస్తాయని ఆశ" అన్నాడు డైరెక్టరు.

"అసలు వాళ్ళు పాడుకునే పాట నీకైమైనా అర్థం అవుతున్నాదా? నాకైతే ఏమీ అర్థం కావడం లేదు."

"అర్థం కాదు. అర్థం కాకుంటే జనాలకి అదో క్రేజు మరి. చూడండి చూడండి."

"అదేంటయ్యా డైరెక్టరూ... ఆ హీరో అలా తిక్క రోగం వచ్చినా కోడిలా అలా గింజుకుంటున్నాడు. అతనికేమన్నా మూర్ఛ రోగం వుందా?" అనుమానంగా అడిగాడు.

"చంపేశారు నిర్మాతగారూ... అందుకే సస్పెన్స్ అని ముందుగా చెప్పలేదు. సినీ ఫీల్డ్‌లో ఇప్పటికి ప్రపంచంలో వున్న స్టెప్స్ వేసి వేసి, జనం చూసి చూసి విసిగి పోయారు. అందుకే ఇలా కొత్త రకం స్టెప్స్ ప్రవేశపెట్టాను. అది నా. స్పెషల్ మరి" ఆనందంగా నవ్వాడు డైరెక్టరు రెండు చేతులతో తొడల మీద చరుసుకుంటూ.

"అవును. హీరో పెదాలు కదిలిన తరువాత మాటలొస్తున్నాయి ఏమిటి? డబ్బింగ్ అస్సలు బాగాలేదు" విసుక్కున్నాడు నిర్మాత.

"మీ కసలు సినిమా టేస్ట్ లేదండి. తెలుగులో దాదాపు తొంభై శాతం సినిమాలు డబ్బింగ్‌వే కదా... జనాలు వాటిని చూసి చూసి బాగా అలవాటయిపోయారు. మనం డబ్బింగ్ కరెక్ట్‌గా చేసి చూపిస్తే వాళ్ళు సరిగ్గా రిసీవ్ చేసుకోలేరన్న మాట" అన్నాడు.

"మరి విలన్ అసలు తెలుగులోనే మాట్లాడటం లేదు. అతను మాట్లాడే భాష ఏమిటో నీకైనా అర్థం అవుతున్నదా మహాను భావా?"

"మీరుండండి. మీ కసలు సినీ నాలెడ్జి ఏం లేదు. జనాల నాడి పట్టుకుని చూసి మరీ ఈ సినిమా తీశాను. తెలుగు వాళ్ళు సినిమాలో ఎంత వరాయి భాష ఉంటే అంత బాగా ఆదరిస్తారు. అంటే మనకు కనక

●●●

**హీరోయిన్ ముఖం చూపిస్తే జనం వాంతులు చేసుకుంటారు. అందుకనీ...**

●●●

వర్షమన్న మాట. అతను మాట్లాడే భాష ఏదైనా తెలియనిది అయితే ఇంకా బాగుంటుందన్న మాట. మీరు చప్పుడు చేయక సినిమా చూడండి."

"ఓరినీ స్టంట్ పాడుకాను. హీరో కథావరంగా విజృంభిస్తున్నాడు బాగానే వుంది. కానీ డూప్‌ని అలా డైరెక్ట్‌గా చూపించడం బాగుండ దేమో డైరెక్టరు" బుర్ర బర బర గీక్కుని అనుమానంగా అడిగాడు నిర్మాత.

"అదే సస్పెన్స్. చూసే జనాలకి అర్థం కాక పిచ్చెక్కి పోవాలన్న మాట. అదే నా డైరెక్షన్‌లో వున్న సస్పెన్స్" విరగబడి నవ్వుకుంటూ కాళ్ళ మీద చరసుకున్నాడు.

"ఓరినీ తస్సా దియ్య. అంతలోనే రెండో పాటా?"

"మన సినిమాలో పాటలకే చాలా ఇమేజ్ వస్తుంది చూడండి."

"నీ అసాధ్యం కూలిపోను. హీరో హీరోయిన్లను వక్కకు నెట్టేసి గ్రూప్ డాన్సర్లను మాత్రమే చూపిస్తున్నావేమిటయ్యా బాబూ!"

"అదే మన సినిమాలో వెరైటి. ప్రతి సినిమాలో హీరో హీరోయిన్లకు మాత్రమే ఇంపార్టెన్స్ ఇస్తారు కదా... మనం దానికి భిన్నంగా తీశామన్న మాట. ఇక సూపర్ హిట్"

"నాకు గిట్టుపాటు అవుతుందో లేదోనని నేను ఏడుస్తుంటే నువ్వేమో సూపర్ హిట్, సూపర్ హిట్ అంటున్నావు. అదే అంతలోనే విశ్రాంతా?" అన్నాడు నిర్మాత ఆశ్చర్యంగా.

"మీరసలు నిర్మాతా లేక విమర్శకులా? కాస్త ఓపికతో చూస్తే నా డైరక్షన్‌లో గొప్పదనం అర్థం అవుతుంది.

"ఓరినీ బుర్ర పాడుకాను. ఇంతకు కథ ఎవరు రాశారు?"

"నేనేనండి."

"నా ఖర్మ. హీరో తల్లి నీళ్ళలో పడి చనిపోయినట్లు చూపించావు కదా... మరిప్పుడు ఎంచక్కా కొడుక్కి భోజనం తినిపిస్తుం దేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు నిర్మాత తల బర బరమని గోక్కుంటూ.

"ప్రొజెక్టరు ఆఫ్ చెయ్. ఒకసారి అసిస్టెంట్ డైరెక్టరు సిక్స్‌ని పిలువ్..." అన్నాడు డైరెక్టరు కోపంగా. రెండు నిముషాలలో అతను వచ్చి ముందు వాలాడు.

"నీకసలు బుద్ధి వుందా? సీన్స్ కంటిన్యూయేషన్ లేకుండా వుంటే చూడకుండా ఏం చేస్తున్నావు? విశ్రాంతి ముందు హీరో తల్లి నీళ్ళలో పడి చనిపోయిందని చెప్పించాం కదా... మరిప్పుడు కొడుక్కి గోరు ముద్దలు తినిపిస్తున్నది. నిర్మాతగారు కోపంతో నన్ను తిడుతున్నారు" డైరెక్టరు కోపంతో అరిచాడు.


"నిర్మాతకు కలెక్షన్ల మీద వున్న చూపు సినిమా మీద వుండదు. ఆ సీన్ పూర్తిగా చూడండి. కొడుక్కి అన్నం తినిపిస్తూ ఆనాడు నీళ్ళలో పడి ఎలా కొట్టుకుపోయింది, ఎవరు రక్షించింది వివరిస్తున్నది" వినురుగా సమాధానమిచ్చాడు.

"సరి సరి ఇక నువ్వెళ్ళు" అని మళ్ళీ కంటిన్యూ చేయమన్నాడు. మళ్ళీ సినిమా సాగుతున్నది.

"ఏమయ్య డైరెక్టరు ప్రజల్ని మరీ పిచ్చి...ని చేయకు."

"మనం చేసేది అదే కదండి."

"కొంచెం కాకపోతే కొంచమయినా వాస్తవానికి దగ్గరుంటే బాగుంటుంది. హీరో విలను ఎదురుపడి తిట్టుకుంటుంటారు బాగానే వుంది. హీరో కొట్టిన దెబ్బకు విలన్ వెళ్ళి వేరే ఊళ్ళో పడటం చూస్తుంటే నాకే వెగటుగా వుంది" అన్నాడు నిర్మాత మొహం అనహ్యంగా పెట్టి.




"అదేంటి అలా అంటారు? అందులో నాకేం తప్పు కనబడటం లేదు."

"కనబడదు కనబడదు మరి. గురివింద జీవితం కదా... హీరో విలన్‌ని కొట్టాడు. బాగానే వుంది. ఆ సీన్‌లో వెనుక వాల్ పోస్టర్లు, సైన్ బోర్డులు అన్నీ తెలుగులో వున్నాయి. విలన్ వెళ్ళి వడ్డాడు చూడు అక్కడ పోస్టర్లు, సైన్ బోర్డులు మాత్రం అన్నీ అరవంలో వున్నాయి" విసుక్కున్నాడు.

"మీ విమర్శనా దృష్టికి నా జోహార్లు నిర్మాతగారు. ఈసారికిలా లాగించేద్దాం. మీరేం వర్రీ అవకండి మిగతాదంతా నేను చూసుకుంటాను కదా"

"అదేంటయ్యా బాబూ... హీరో హీరోయిన్‌లు కిలోమీటర్ దూరంలో వున్నట్లు చూపిస్తున్నావు. మరి వాళ్ళిద్దరు ఎదురెదురుగా వున్నట్లు మాట్లాడుకుంటున్నారు. ఇదింకా ఘోరంగా వుంది."

"గాలి వాటం వల్ల హీరో మాటలు హీరోయిన్‌కి వినబడుతున్నాయి. మౌత్ రీడింగ్ తెలిసిన హీరో ఆమె మాటల్ని అర్థం చేసుకుంటున్నాడు. దీన్ని మీరేం పట్టించుకోకండి. సీన్ మారింది చూడండి చూడండి" అన్నాడు డైరెక్టరు.

"హీరో చూస్తుంటే రివటంలా వున్నాడు. ఆ మిషన్ గన్‌ని రివాల్వర్‌లా షూట్ చేస్తున్నాడు. ఇది మరీ అసభ్యంగా వున్నట్లుగా వుంది. నాకేం నచ్చలేదు."

"చంపారు పొండి. హీరోయిజం అంటే అదేనండి బాబు. ఈ సినిమా హిట్ చేయించే బాధ్యత నాది. మీరు నిశ్చింతగా సినిమా చూడండి."

"ఇదేం సినిమా డైరెక్టరు? విలన్ హీరోని కండలన్నీ తెగ్గోసి, రక్తమంతా కార్చేసి, ఇష్టం వచ్చినట్లు తంతున్నారు. కొంపదీసి హీరో ఛస్తాడా ఏమిటి? కదలికలు కూడా లేవు. చస్తే ఏం బాగుంటుంది? అంతలోనే... ఓర్నీ దుంప తెగ. చచ్చిన శవం లేచి వచ్చినట్లు ఒళ్ళంతా గాయాలయిన హీరో అలా మరీ విజృంభిస్తున్నాడేమిటి? మరి గాయాలేమైయ్యాయి. ముక్కున వేలేసుకున్నాడు నిర్మాత.

"అదే హీరోయిజం అంటే. అదే నా డైరెక్షన్‌లో స్పెషల్ మరి. ఆ దెబ్బలతోనే విలన్‌ని అతని అనుచరుల్ని చితక బాది బాది పోలీసుల కప్పగించి వరుగెత్తుకుంటూ వరుగెత్తుకుంటూ బ్రేకులు పాడయిన కారులో వెళుతున్న హీరోయిన్‌ని రక్షిస్తాడు. ఎలా వుంది సినిమా" అన్నాడు డైరెక్టరు.

"నా బొందలా వుంది. నా శ్రాద్ధంలా వుంది. నా మొహంలా వుంది. ఇదో సినిమా, అందులో నీ స్పెషల్ డైరెక్షనును" విసుక్కున్నాడు నిర్మాత.

"ఇక్కడ చూడండి హీరో హీరోయిన్ స్లోమోషన్‌లో అలా ఒకరి ఎదురుగా ఒకరు ఎదురుగా వస్తుండగా శుభం వడుతున్నది చూడండి. నా డైరెక్షన్ అదిరి చచ్చింది... అంతే" అన్నాడు డైరెక్టర్ గబగబా తొడల మీద చరుచుకుంటూ.

"నాకు మొత్తం మీద ఈ శుభం మాత్రం బాగున్నది. నీ డైరెక్షను నవ్వు నాశనం కాను. చేతికి బుట్టు చెవిలో చుట్ట కాదు. చేతికి చిప్ప నెత్తిన గుడ్డ అని దీని టైటిల్ మార్చు. అదే నాకు సరిపోయే టైటిల్" అంటూ నెత్తిన గుడ్డ కప్పుకుని బావురు బావురుమని ఏడ్చాడు నిర్మాత. ●